ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3

కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 5 మార్చి 2024







నిరసన

ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చాంబర్స్ పిలుపు మేరకు చాంబర్స్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. పంచాయతీల మనుగడను ప్రశ్నార్థకం చేసిన వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

- 4లో..

మెట్టినింటికి వీరమ్మ

ముగిసిన తిరునాళ్ల మహోత్సవాలు



తిరునాళ్లలో భక్తుల కోలాహలం (ఇన్‌సెట్‌లో) మొక్కులు తీర్చుకుంటున్న పోలీసులు

ఉయ్యూరు, మార్చి 4 : ఉయ్యూరులో 15 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన వీరమ్మతల్లి తిరునాళ్ల సోమవారం ముగిసింది. తిరునాళ్లలో లక్షలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నాక చివరి రోజు రాత్రి ఆలయం నుంచి బయల్దేరిన అమ్మవారు.. తిరుగుగండ దీపాలతో భక్తులు వెంటరాగా మేళతాళాలతో ముందుకు కదిలారు. ఊరంతా ఊరేగి సోమవారం అర్ధరాత్రి దాటాక ప్రధాన రహదారిపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. కాగా, 15 రోజుల పాటు తిరునాళ్లలో దర్శనమిచ్చిన అమ్మవారు భక్తుల పసుపు కుంకుమ, చీర సారెలందుకున్నారు. రెండు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నవారు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో చివరి రోజు పట్టణ పోలీసులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్, ఏఎస్సైలు, రైటర్, సిబ్బంది పసుపుకుంకుమ, చీర, సారె, పొటేళ్లతో ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కు చెల్లించుకున్నారు.

అధికార పార్టీ సారాజ్యం

ఎన్నికల వేళ ముమ్మరంగా కాపుసారా తయారీ



ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో కాపుసారా ఏరులై పారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు దీన్నో సాధనంగా మలచుకుని తయారీకి ఆర్డర్లు ఇస్తున్నారు. మడ అడవులే అడ్డాగా మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో జోరుగా సాగుతున్న ఈ వ్యాపారానికి అధికార పార్టీ నాయకులు అండగా ఉంటున్నారు. దాడులు చేయాల్సిన పోలీసులు రాజకీయ ఒత్తిడికి తలొగ్గడంతో విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయి.

- అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే..
- మడ అడవులే అడ్డాగా అర్ధరాత్రి తయారీ
- రాజకీయ ఒత్తిడితో పట్టించుకోని పోలీసులు
- తీరప్రాంత మండలాల్లో పెరిగిన జోరు
- బహిరంగంగానే విక్రయిస్తున్న మహిళలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలోని గిలకలదిండి, పోలాటితిప్పలోని మడ అడవుల్లో కాపుసారా తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాల్లో ఆయా కుటుంబాలవారు పోటీపడి మరీ సారా కాస్తున్నారు. గిలకలదిండి హార్బర్ నుంచి సముద్రంలోకి వెళ్లే కాల్వ మార్గంలో కుడివైపు పెద్ద ఎత్తున మడ అడవులున్నాయి. ఇక్కడికి చేరుకోవాలంటే బోట్ల ద్వారానే వెళ్లాలి. చేపల వేటకు వెళ్తున్నట్టుగా చూపి కాపుసారా తయారీకి ఉపయోగించే సరుకులను పడవల్లో తరలిస్తున్నారు. వారం పాటు మడ అడవుల్లోనే మకాం ఉండి సారా కాస్తున్నారు. స్థానికుల సహకారం లేకుండా ఆ ప్రాంతానికి చేరుకోవడం కష్టమైన పని. ఇదే అవకాశంగా తీసుకుని కాపుసారా తయారీ ఇక్కడ జోరుగా సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. వారానికి ఒక్కో బట్టీ ద్వారా వేయి లీటర్లకుపైగా సారాను గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడి నుంచి బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

- కరగ్రహారంలో ముడాకు ఇచ్చిన భూముల్లో ఖాళీగా ఉన్న రొయ్యల చెరువుల వద్ద, మోడుల దిబ్బ తదితర ప్రాంతాల్లో జోరుగా కాపుసారా తయారు చేస్తున్నారు. ఈ గ్రామం నుంచి రోజుకు వెయ్యి లీటర్లకు పైగా ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. గిలకలదిండిలో కాచిన కాపుసారాను కరగ్రహారం ప్రాంతంవారే కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేకంగా మనుషులను ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులు ఈ ప్రాంతంలో కాపుసారా కాసేవారిని పట్టుకుంటే అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకుని, వారిపై ఒత్తిడి తెచ్చి, వారిని విడిపించేయడం రివాజుగా మారింది. గిలకలదిండి ప్రాంతంలో స్థానికంగా కొందరు మహిళలు కాపుసారాను బహిరంగంగానే విక్రయిస్తున్నారు.
- పెడన నియోజకవర్గం సముద్రతీర ప్రాంతంలో ఉన్న కృత్తివెన్ను మండలం నిడమర్రు, ఒర్లగొందితిప్ప, చినగొల్లపాలెం, పెదగొల్లపాలెం, ఇంతేరు, పడతడిక, పోడు తదితర గ్రామాల్లోని సరుగుడు తోటలు, ఇసుకదిబ్బల్లో కాపుసారా తయారీ ఇటీవల కాలంలో అధికమైంది. అర్ధరాత్రి సమయంలో కాపుసారాను కాస్తున్నారు. ఇదే సమయంలో పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల్లోని పలు ప్రాంతాలకు రవాణా చేసున్నారు. బంటుమిల్లి, బందరు మండలానికి సరిహద్దుగా ఉన్న నారాయణపురం, పెదపట్నం, కానూరు గ్రామాల పరిధిలో మడ అడవులున్నాయి. ఈ అడవిలో కాపుసారా జోరుగా సాగుతోంది. ఇక్కడికి చేరుకునేందుకు కొత్త వ్యక్తులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఇక్కడ కాపుసారా తయారీ జోరుగా సాగుతోంది. పెడన, గూడూరు తదితర ప్రాంతాల్లోనూ కాపుసారా తయారీ కేంద్రాలు కుటీర పరిశ్రమ మాదిరిగా కొనసాగుతున్నాయి.

రెడీమేడ్‌గా తయారీ

గతంలో కాపుసారా తయారీలో పాడైన వివిధ రకాల పండ్లను వినియోగించేవారు. పాడైన పండ్లు, అమ్మోనియా, యూరియా, సూరేకారం, ఎండుమిరప, తక్కువ ధరకు లభించే బెల్లాన్ని 15 రోజుల పాటు నిల్వ ఉంచి, ఆ తరువాత కాపుసారాను తయారు చేసేవారు. ప్రస్తుతం వారం పాటు మాత్రమే బెల్లం ఊటను నిల్వ ఉంచి కాపుసారా కాస్తున్నారు. సారా తయారు చేశాక అందులో నిద్రమత్తు బిళ్లలను కలిపి విక్రయిస్తున్నారు. గతంలో ఎస్‌ఈబీ, సివిల్ పోలీసులు బృందాలుగా ఏర్పడి సారా తయారుచేసే వారిని అదుపులోకి తీసుకునేవారు. కొంతకాలంగా దాడులు చేసేందుకు పోలీసులు వెనుకంజ వేస్తున్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు అప్పుడప్పుడు దాడులు చేస్తూ మమ.. అనిపిస్తున్నారు.

అధికార పార్టీ నాయకుల అండదండలు

గిలకలదిండి, కరగ్రహారంలో కాపుసారా తయారీదారులకు స్థానికంగా అధికార పార్టీ నాయకులు అండగా ఉంటున్నారు. నెలవారీ మామూళ్లుగా ఒక్కొక్క తయారీదారుడి నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు. తయారీదారులు ఎవరైనా పోలీసులకు పట్టుబడితే కనీసం రూ.50 వేల నగదు చేతులు మారుతోంది. పట్టుబడిన వారి నుంచి నగదు తీసుకుని కేసులు నమోదు చేయకుండానే హెచ్చరించి పంపేస్తున్నారు. గతంలో పోలీస్ ఉన్నతాధికారులు కాపుసారా కాసేవారిని పిలిపించి పరివర్తన పేరుతో సమావేశాలు నిర్వహించేవారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఈ కార్యక్రమానికి కొంతకాలంగా బ్రేక్ పడింది.

ఆరంభశూరత్వం

పనులు పూర్తికాకుండానే బస్టాండ్ ప్రారంభ సన్నాహాలు

- హనుమాన్ జంక్షన్‌లో హడావుడి పనులు
- నాణ్యతపై ప్రజల్లో పలు అనుమానాలు



పనులు జరుగుతున్న హనుమాన్ జంక్షన్ బస్టాండ్

హనుమాన్ జంక్షన్ రూరల్, మార్చి 4 : అత్యాధునిక ప్రమాణాలతో, రూ.5 కోట్లతో నిర్మిస్తున్న హనుమాన్ జంక్షన్ బస్టాండ్ పనులు జరుగుతుండగానే ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తు న్నారు. కొద్దిరోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుండటంతో ఈ హడావుడి చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామో లేదో అనే మీమాంసతో ఈ ప్రభుత్వంలో ఉండగానే, ప్రారంభించేయాలని అధికార పార్టీ నాయకులు తహతహలాడుతున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ఆర్టీసీ ఎండీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వాణిశ్రీ, రీజనల్ ఛైర్మన్ పిన్నింటి మహేశ్‌తో పాటు ఇటీవలే అసెంబ్లీలో అనర్హత వేటు పడిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కూడా హాజరవుతున్నట్లు సమాచారం. కాగా, దీనిపై గన్నవరం డీఎంను సంప్రదించగా, ఇంతవరకూ అలాంటిదేమీ లేదని చెప్పుకొచ్చారు.

నాణ్యతపై అనుమానాలు

హడావుడిగా చేస్తున్న పనులతో బస్టాండ్ నిర్మాణ నాణ్యతపై ప్రజల్లో ఇప్పటికే అనుమానాలు ప్రారంభమయ్యాయి. బస్సులు తిరిగే రహదారిని పటిష్ఠంగా నిర్మిస్తు న్నారా లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంపై స్థానిక టీడీపీ, జనసేన నాయకులు పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. వల్లభనేని వంశీపై అనర్హత వేటు పడటంతో మాజీ శాసనసభ్యుడిగా చెలామణి అవుతున్నారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం పదవీ కాలం పూర్తయిన తర్వాత కానీ, వివిధ కారణాలతో పదవిని కోల్పోయినప్పుడు కానీ సదరు ప్రజాప్రతినిధిని ఎటువంటి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ఆహ్వానించకూడదు. అలాంటప్పుడు హనుమాన్ జంక్షన్ బస్టాండ్ ప్రారంభోత్సవానికి మాజీ శాసనసభ్యుడు వల్లభనేని వంశీమోహన్‌ను ఎలా ఆహ్వానిస్తున్నారన్నది అధికారులకే తెలియాలి.

దుర్గగుడిలో శివరాత్రి శోభ

రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

వన్‌టౌన్, మార్చి 4 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 6 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో కేఎస్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఉత్సవమూర్తులకు మంగళస్నానాలు చేయిస్తారు. అనంతరం వధూవరులుగా అలంకరిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠాపన, మండపారాధన పూజ, ధ్వజారోహణ, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరుగుతాయి. 7వ తేదీ గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 6.30 గంటల వరకు మండపారాధన, అవుపాసనలు, బలిహరణ, మూలమంత్ర హవనం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయి. 8వ తేదీ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లేశ్వరస్వామికి త్రికాల అర్చనలు, అభిషేకాలు, రాత్రి 9.30 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 12.30 గంటలకు గంగా పార్వతీ సమేత మల్లేశ్వరుల దివ్యలీలా కల్యాణోత్సవం జరుగుతాయి. 9వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మండపారాధన పూజ, అవుపాసనలు, బలిహరణ, మూలమంత్ర హవనం, 9 గంటలకు మల్లేశ్వరాలయంలో సదస్యం, వేదస్వస్తి, సాయంత్రం 4 గంటలకు మండపారాధన, అవుపాసనలు, బలిహరణ, మూలమంత్ర హవనం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, రథోత్సవం జరుగుతాయి.

10వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకొట్నోత్సవం, వసంతోత్సవం, అనంతరం దుర్గాఘాట్‌లో అవభృథోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం నిర్వహిస్తారు. 11వ తేదీ సోమవారం సాయంత్రం పంచహారతులు, 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, పుష్పయాగోత్సవం జరుగుతాయి. 12, 13 తేదీల్లో రాత్రి 8 గంటలకు పవళింపు సేవ ఉంటుంది. కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.1,116 రుసుం చెల్లించాలి.

నకిలీ మంత్రమా..

గన్నవరంలో మళ్లీ వంశీ నకిలీ పట్టాల తంతు




గన్నవరం నియోజకవర్గంలో అధికార వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ మరోసారి నకిలీ పట్టాల మంత్రాన్ని జపిస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు సుమారు 11 వేల మందికి నకిలీ పట్టాలు ఇచ్చిన వంశీ మరోసారి అదే బాటలో పయనించేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే పదవి ఊడినా.. అదే హోదాలో మంగళవారం పట్టాలు పంపిణీ చేసేందుకు కుట్ర పన్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2019 ఎన్నికల ముందు 11వేల మందికి నకిలీ పట్టాలు

- అప్పుడు బాపులపాడు మండలంపైనే దృష్టి
- ఈసారి నియోజకవర్గంలోని అన్ని మండలాలపైనా
- చెరువులను చెరబట్టి.. పట్టాలు సిద్ధం చేసి..
- ఎమ్మెల్యే పదవి ఊడినా.. అదే హోదాలో నేడు పంపిణీ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గత ఫిబ్రవరి 26న గన్నవరం ఎమ్మెల్యే వంశీపై అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేశారు. దీంతో ఆయన ఎమ్మెల్యే పదవి ఊడింది. కానీ, మంగళవారం ఎమ్మెల్యే హోదాలో ఆయన పలు ప్రారంభోత్సవాలు, రంగన్నగూడెంలో పట్టాల పంపిణీ చేపట్టనున్నారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ఎలాగైనా ఓటు బ్యాంకును కొల్లగొట్టాలన్న లక్ష్యంతో వంశీ ఈ పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఈసారి వంశీకి వైసీపీ టికెట్ వస్తుందా, రాదా అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. అయితే, కోర్టు కేసులకు హాజరయ్యేందుకు సుదీర్ఘకాలం తర్వాత సోమవారం వంశీ నియోజకవర్గానికి వచ్చారు. పనిలో పనిగా మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అయితే, ఈసారి కూడా ఆయన 2019 ఎన్నికల ముందు తరహాలోనే నకిలీ పట్టాలనే పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది మేలో గన్నవరం రెవెన్యూ అధికారులు 48 ఎకరాల వెదురుపావులూరు చెరువు భూములను సర్వేచేసి హడావిడి చేశారు. ఆ తర్వాత నియోజకవర్గంలోని పలు మండలాల్లో చెరువులనూ సర్వేచేసి ఆ భూముల్లో పేదలకు పట్టాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజావసరాలకు ఉపయోగపడే చెరువులను ఎలా స్వాధీనం చేసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వంశీ చెప్పిందే తడవుగా రెవెన్యూ అధికారులు సైతం చెరువులు, డీ పట్టా భూములపై పడి సర్వే చేస్తూ హడావిడి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. దీంతో ప్రస్తుతం ఇచ్చే పట్టాలు ఏ మేరకు పేదలకు ఉపయోగపడతాయన్నది ప్రశ్నార్థకమే.

2019లోనూ నకిలీ మంత్రమే..



గత ఎన్నికలకు ముందు వంశీ ఇచ్చిన నకిలీ పట్టా

బాపులపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, పోరంబోకు స్థలాలు, చెరువు గట్లపై స్థిర నివాసాలు ఏర్పరుచుకుని జీవిస్తున్న పేదలకు 2019, ఏప్రిల్ 7న అర్ధరాత్రి నకిలీ ఇళ్ల పట్టాలను అప్పట్లో టీడీపీ తరఫున పోటీ చేసిన వంశీ, ఆయన అనుచరులు పంపిణీ చేశారు. బాపులపాడుతో పాటు కొయ్యూరు, పెరికీడు గ్రామాల్లో 3వేల మందికిపైగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మొత్తం మీద 11 వేల వరకు ఇలా పట్టాలు పంపిణీ చేశారు. అయితే, ఇళ్ల పట్టాలపై మంజూరు చేసిన తేదీ, లబ్ధిదారుడి ఫొటో, ఆర్సీ నంబరు, ఎల్‌డీ ఫైల్ నంబర్లు లేకపోవడంతో పలువురు లబ్ధిదారులకు అనుమానాలు రేకెత్తడంతో అసలు విషయం బయటపడింది. 2018, ఆగస్టులో బదిలీ అయిన తహసీల్దార్ సంతకాన్ని రబ్బరు స్టాంపు చేయించి ఇళ్ల పట్టాలపై ముద్రించి ఉండటం వారి అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది. ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా, ఈ విషయంపై గన్నవరానికి చెందిన ముప్పలనేని రవికుమార్ స్పందనలో అప్పటి జిల్లా కలెక్టర్ ఇంతియాజ్‌కు తొలి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత సుమారు 100 మందికిపైగా లబ్ధిదారులు అప్పటి తహసీల్దార్ సీహెచ్ నరసింహారావును కలిసి నకిలీ ఇళ్ల పట్టాలపై ఫిర్యాదు చేశారు. ఇళ్ల పట్టాలపై ఉన్న తహసీల్దార్ పాస్‌మెయిల్ సంతకం, కార్యాలయం స్టాంపు పూర్తిగా ఫోర్జరీ చేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించిన ఆయన సమగ్ర విచారణ జరపాలంటూ 2019, అక్టోబరు 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. వల్లభనేని వంశీ, ఆయన ప్రధాన అనుచరులు ఓలుపల్లి మోహనరంగా, కాట్రు శేషు, జాస్తి ఫణి, కొల్లి రంగారావు, వేగిరెడ్డి పాపారావు, కొత్తూరి అంజనేయులు, సింగవరపు దుర్గా ప్రసాద్, లావేటి నారాయణ, బండారు సత్యనారాయణపై పోలీసులు కేసు నమోదు చేశారు. చీటింగ్, ఫోర్జరీ, ఎన్నికల నియమావళి ఉల్లంఘన అభియోగాలపై కేసు రిజిస్టర్ చేశారు. ఈ కేసు తీవ్రత పెరుగుతుండటంతో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న వంశీ పార్టీ మారి వైసీపీ పంచన చేరారు. దీంతో ఈ కేసు కూడా అటకెక్కింది. తాజాగా మళ్లీ నకిలీ మంత్రాన్న వంశీ జపిస్తున్నారు.

సమగ్ర విచారణ జరపాలి

టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మార్చి 4 : గన్నవరం నియోజకవర్గంలో నకిలీ ఇళ్ల పట్టాల మంజూరుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఉన్నతాధికారులకు సోమవారం లేఖ రాశారు. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ రాజాబాబుకు ఆయన ఈ లేఖ రాశారు. నకిలీ ఇళ్ల పట్టాలు కేటాయించి ఓటర్లను ప్రలోభ పెట్టి మోసగించాలని చూస్తున్నారని, గన్నవరంపై ప్రత్యేక దృష్టిసారించి నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకోవాలని కోరారు. ఐదేళ్ల క్రితం వల్లభనేని వంశీ బాపులపాడు మండలంలో 11వేల మంది ఓటర్లకు నకిలీ ఇళ్లపట్టాలిచ్చి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని, ఆ సమయంలో అతనితో పాటు మరికొందరిపై క్రిమినల్ కేసులు, ఫోర్జరీ కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. ఆ తర్వాత వంశీ పార్టీ మారి కేసుల నుంచి తప్పించుకున్నారన్నారు. ఇలాంటి కార్యకలాపాలను అరికట్టడంతో పాటు అతనికి సహకరిస్తున్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కృష్ణామిల్క్ యూనియన్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల

పాడిపరిశ్రమ హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో కృష్ణామిల్క్ యూనియన్ స్టాల్

» ప్రారంభించిన తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చిట్టినగర్, మార్చి 4 : 50వ పాడిపరిశ్రమ సదస్సును పురస్కరించుకొని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్‌జోన్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) ఏర్పాటు చేసిన స్టాల్‌ను యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ఆహ్వానం మేరకు సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంలో కృష్ణా మిల్క్ యూనియన్ స్టాల్‌ను వీక్షించిన ఆయన పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి యూనియన్ చేస్తున్న విశేష కృషిని అభినందించారు. స్టాల్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, ఇండియన్ డెయిరీ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ఎస్ సోధి, సందర్శించారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహా శివరాత్రిని విజయవంతం చేయండి

» ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

మోపిదేవి, మార్చి 4 : పెదకళ్లేపల్లిలో ఈ నెల 8, 9 తేదీల్లో జరుగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను సమష్టి కృషితో విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, చల్లపల్లి సీఐ సీహెచ్.నాగ ప్రసాద్‌లు తెలిపారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు మాట్లాడుతూ, దుర్గానాగేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు, మహాశివరాత్రి సందర్భంగా లక్ష మంది భక్తులు విచ్చేస్తారనే అంచనాతో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా స్వామివారి ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీఎల్‌పీవో జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘటన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి



జగ్గయ్యపేట, మార్చి 4 : టీడీపీ రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా జగ్గయ్యపేటకు చెందిన రాచూరి విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం లో జరిగిన ఆర్‌బీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమెకు జాతీయ అధ్యక్షుడు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి రామకృష్ణారావు, యనమంట సురేశ్‌లు నియామకపత్రం అందజేయగా, ఆర్‌బీఎస్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన నియామకానికి కృషి చేసిన విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జాతీయ టీడీపీ కోశాధికారి శ్రీరాం తాతయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బ్రాహ్మణులకు టీడీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందిన సంక్షేమ ఫలాలను వివరించి, చంద్రబాబుకు మద్దతు కూడగడతామని చెప్పారు. జిల్లా, నియోజకవర్గ కమిటీలు వేసి సంఘటన్‌ను పటిష్టం చేస్తామని తెలిపారు.



తుపాను షెల్టర్ పరిశీలన అనంతరం మాట్లాడుతున్న జర్మనీవాసులు

తుపాను షెల్టర్ పరిశీలించిన జర్మనీ బృందం

కోడూరు, మార్చి 4 : కోడూరు మండల పరిధిలోని ఊటగుండం గ్రామంలో గతంలో జర్మనీ వారు నిర్మించిన తుపాను షెల్టర్‌ను జర్మనీ వాసి గుజ్జుల రవీంద్ర బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా గుజ్జుల రవీంద్ర మాట్లాడుతూ, 'మా నాన్న ప్రకాశం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేశారని, ఆయన పేరున పేదలకు ఉపయోగపడే విధంగా భవనాలు నిర్మాణం చేయాలని జర్మనీలో విరాళాలు సేకరించినట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో తుఫాన్ కారణంగా ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, వారికి ఉపయోగపడే విధంగా భవంతులు నిర్మించాలని, వారి తరపున మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పూర్తి సహకారం అందించటంతో ఇక్కడ తుఫాన్ షెల్టర్ నిర్మించినట్టు తెలిపారు. మండలి సహకారం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం జర్మనీ బృందాన్ని దుశ్శాలువాలతో గ్రామస్థులు సత్కరించారు. జర్మనీ వాసులు గుజ్జుల గాబ్రియేలు, ఈర్నాల్ లూడింగ్, స్థానిక టీడీపీ నేతలు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన చిన్నారులతో పాఠశాల డైరెక్టర్ మంజుల

ఘనంగా విశ్వభారతి 56వ వార్షికోత్సవం

గుడివాడ, మార్చి 4 : రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి ప్రైమరీ పాఠశాల 56వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. తొలుత వేడుకలను పాఠశాల డైరెక్టర్ ఆర్.మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనల్లో బహుమతులు సాధించిన చిన్నారులు, కరాటే, రోలర్ స్కేటింగ్‌లో పతకాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. 2023-24 వార్షిక సంవత్సరానికిగాను నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలు జి.యశ్విన్ (5వ తరగతి), ఎస్.కె అహమ్మద్ కబీర్ (4వ తరగతి), జి.వర్షిత్(3వ తరగతి)లకు పాఠశాల డైరెక్టర్లు మంజుల, కీర్తిలు ట్రోఫీలను బహూకరించారు. ప్రిన్సిపాల్ రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు, కొత్త రేపూడిలో తాళం వేసిన అంగన్వాడీ కేంద్రం

ప్రభుత్వ కార్యక్రమాల్లో తరిస్తున్న ఉద్యోగులు!

ఎ.కొండూరు, మార్చి 4 : ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, చిన్నారులకు అక్షరాలు నేర్పాల్సిన అంగన్వాడీ టీచర్లు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ నేతల సేవల్లో తరిస్తున్నారు. సోమవారం మండలంలో రామచంద్రాపురం, చీమలపాడు, మాధవరం, కొత్తరేపూడి, కోడూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, ఆర్బీకే, ఆరోగ్యకేంద్రాలను ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) తిరువూరు వైసీపీ అభ్యర్థి స్వామిదాసులు ప్రారంభించారు. పోలిశెట్టిపాడు జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు బాణావతు సూర్య వైసీపీ నేతలతో కలిసి చీమలపాడు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రేపూడి గ్రామ పరిధిలోని నాలుగు అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేసి కార్యకర్తలు, హెల్పర్‌లు పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వసిబ్బంది నేతల సేవల్లో తరించడంపట్ల స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

సీఎంపై పోరుకు సిద్ధం

» వంద మంది నానీలు వచ్చినా తరిమికొడతాం

» తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత

» గుడివాడలో మహిళా గళం సదస్సు



మహిళా సదస్సు వేదికపై రాము, రావి, కొనకళ్ల, మహిళా ప్రతినిధులు

గుడివాడ రూరల్, మార్చి 4 : ఎన్నికల సమరంలో జగన్‌ను ఢీకొనేందుకు కొంగు బిగించి.. తామూ సిద్ధమేనని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. గుడివాడ పట్టణం బంటుమిల్లి రోడ్డులోని తాళ్లూరి కళ్యాణ మండపంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో 'మహిళా గళం' సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని స్వర్ణలత, టీడీపీ నేతలు ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ, గుడివాడ నడిబొడ్డున ఉండి చెబుతున్నాం.. వందమంది కొడాలి నానిలు వచ్చినా తరిమికొట్టడానికి సిద్ధమన్నారు. వైసీపీ దుర్మార్గులు అధికార మదంతో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. జగన్ రెడ్డి ప్రచారానికి తప్ప.. దిశ చట్టం వల్ల మహిళలకు కలిగిన ప్రయోజనం శూన్యమన్నారు.

తెలుగు తల్లులకు చేతులెత్తి మొక్కుతున్నా..

: వెనిగండ్ల రాము

అరాచక ప్రభుత్వంపై తెగువతో పోరాడుతున్న మహిళా తల్లులకు చేతులెత్తి మొక్కుతున్నా అని వెనిగండ్ల రాము అన్నారు. మహిళల సభతో మరింత స్ఫూర్తి పెరిగిందన్నారు. వాడవాడలా మహిళల స్పందన, ప్రోత్సాహం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. యావత్ మహిళా లోకం చంద్రబాబుకు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గుడివాడలోనే కాదు, జిల్లా వ్యాప్తంగా మహిళలు నడుం బిగించి టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచి గెలిపించాలన్నారు. గుడివాడలో కొడాలి నానిని ఓడించి, ప్రజలకు మంచి పాలన అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పామర్రు అభ్యర్థి వర్ల కుమార్‌రాజా, అంగన్‌వాడీ డ్వాక్రా విభాగాల రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, తెలుగు మహిళా జిల్లా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, పొదిలి లలిత, షైనేని ఇందిర, మూల్పూర్తి కళ్యాణి, షేక్ ఆషా, చక్రాల ఉష, అనంతలక్ష్మి, సాయ పుష్పావతి, తూము పద్మజ, యార్లగడ్డ సుధారాణి, కొల్లి రమ్య, వేమూరి సుజాత, కాటూరి గంగాభవాని, పొట్లూరి రమాదేవి, మరీదు నాగలక్ష్మి, తెల్లాకుల నాగలక్ష్మి, అనిలేటి నిర్మల, బొర్రా శాంతి, యలమంచిలి సుష్మ, మాదాల సునీత, మల్లికా బేగం, నిమ్మగడ్డ శశికళ, బంటు రోజా, దివ్య చౌదరి, గుడివాడ టీడీపీ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, కొసరాజు బాపయ్య చౌదరి, జిల్లా తెలుగు మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఓడిస్తేనే పంచాయతీలకు మనుగడ

» అన్ని పార్టీల సర్పంచ్‌లు కలిసిరావాలి

» మరో దారిలేకే ఈ కఠిన నిర్ణయం

» కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమంలో వైవీబీ రాజేంద్రప్రసాద్

మచిలీపట్నం టౌన్, మార్చి 4 : జగన్‌ను ఓడిస్తేనే నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలకు మనుగడ అని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చాంబర్స్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు.రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం, పంచాయతీ చాంబర్స్ పిలుపు మేరకు మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద సోమవారం వైవీబీ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఓడించేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల సర్పంచ్‌లు ముందుకు రావాలన్నారు. మరో దారిలేక ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, కేంద్ర ఆర్థిక సంఘం నిధుల కోసం రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అనేక ఉద్యమాలు, ఆందోళనలు, పోరాటాలు చేశామన్నారు. 12918 గ్రామాల్లో 3.50కోట్ల మంది గ్రామీణులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లాగా మిగిలారన్నారు. అసమర్థులు, చేతకాని వారుగా సర్పంచ్‌లను ప్రజలు భావిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే పల్లెలు శిథిలమై పోతాయన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రాజకీయ పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు ఆత్మాభిమానం చంపుకుని బ్రతుకుతున్నామన్నారు. 'జగన్ ఓడితేనే మనకు మనుగడ' నినాదంతో ఈ రెండు నెలలు చిత్తశుద్ధితో, పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడికృష్ణాజిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంతకుమార్, కృష్ణాజిల్లా సర్పంచ్‌ల సంఘ జిల్లా గౌరవ సలహాదారు ముల్లంగి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి, పెదయాదర సర్పంచ్ గల్లా తిమోతి, సంఘ రాష్ట్ర కార్యదర్శి కాగిత గోపాలరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముప్పనేని రవిప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మండలి ఉదయభాస్కర్, పంచకర్ల సురేష్, మర్రివాడ సర్పంచ్ వంపుగడల ఫ్రాన్సిస్, సంఘ జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి శ్రీనివాసరావు, అంకం మారుతీరావు, సూరపనేని ప్రసాద్, వెంకటేశ్వరరావు, ఎండి రఫీ, ఆకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ తదితరులు 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు.

స్పందన అర్జీలు సత్వరం పరిష్కరించండి

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో జేసీ గీతాంజలిశర్మ, అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా,





నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. సోమవారం 135అర్జీలను వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మచిలీపట్నంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మైనారిటీలు, ఈబీసీ విద్యార్థులకు ఎలాంటి ప్రవేశపరీక్ష లేకుండానే అడ్మిషన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు

పీఎం సౌరవిద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పీఎం సౌరవిద్యుత్ పథకాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజాబాబు అన్నారు. పథకం అమలు కోసం ఏపీ సీపీడీసీఎల్ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. దిగువ, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నెలకు 150యూనిట్లు విద్యుత్ వినియోగించే వారికి రూ.60వేలవరకు, 300లోపు వాడేవారికి రూ.78వేల వరకు సబ్సిడీగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, డీఎస్‌వో పార్వతి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డీపీవో నాగేశ్వరనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డీఈవో తాహెరా సుల్తానా, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, విద్యుత్‌శాఖ ఈఈ భాస్కరరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 108 అర్జీల నమోదు

కృష్ణలంక : స్పందనలో 108 అర్జీలు నమోదు అయ్యాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావులు అర్జీదారుల వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో అర్జీలను అలసత్వం లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోను రీ ఓపెన్ కాకుండా ఉండాలన్నారు. అర్జీదారుల వినతులను సంబంధిత శాఖలకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనికుమారి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట సమన్వయానికి కమాండ్ కంట్రోల్ కేంద్రం

» ఫిర్యాదుల పరిష్కారంతో పాటు నివేదికల నిర్వహణా కీలకం » అవగాహనతో ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలి : కలెక్టర్ ఢిల్లీరావు



ఎన్నికల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 4 : ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందులో భాగంగా పటిష్ట సమన్వయానికి జిల్లాస్థాయి సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని (ఐసీసీసీ) ఏర్పాటు చేస్తున్నట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సోమవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఎన్నికల వ్యయ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్), ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల నిర్వహణ, సోషల్ మీడియాసెల్ విధి విధానాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ తదితరాలపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా నోడల్ అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు, ఫయింగ్‌స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ స్క్వాడ్స్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ, స్వీప్ కార్యక్రమాలు తదితరాల మధ్య పటిష్ట సమన్వయ సాధనకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం కీలకంగా వ్యవహరించనుందని వివరించారు. ఈ కేంద్రం విజయవంతంగా పనిచేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సీ విజిల్, నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (ఎన్‌జీఆర్ఎస్) తదితర మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించడం ఎంత ముఖ్యమో సరైన విధంగా నివేదికల్లో పొందుపరిచి సమర్పించడం కూడా అంతే ప్రధానమన్నారు. వివిధ విభాగాల కార్యకలాపాలు, నివేదికల సమర్పణలో వేగంతో పాటు ఖచ్చితత్వం కూడా కీలకమని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన యాప్, పోర్టల్ ఆధారిత ఐసీటీ వేదికలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విధులపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకొని బృంద స్ఫూర్తితో, నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించడం, చైతన్యవంతులను చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు ఇందుకు సోషల్ మీడియా వేదికలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంసీఎంసీ, సోషల్ మీడియా సెల్ ద్వారా పెయిడ్ న్యూస్, ఫేక్ న్యూస్‌పైనా పటిష్ట పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల సమన్వయ వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి సీహెచ్.శైలజ, అదనపు డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, డిప్యూటీ కమిషనర్ (ఐటీ) సతీష్ శర్మ, కలెక్టరేట్ ఏఓ సీహెచ్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుఖానికి అడ్డు వస్తున్నాడని..

ప్రియురాలి భర్త దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఎ.కొండూరు, మార్చి 4 : వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుని తమకు అడ్డుగా ఉన్నాడని ప్రియురాలి సహకారంతో ఆమె భర్తను బండరాయితో కొట్టి చంపిన ఘటన ఎ.కొండూరు చైతన్యనగర్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యనగర్‌కు చెందిన పమిడిముక్కల జగదీష్ (42) పదిహేనేళ్ల క్రితం గిరిజన మహిళ భూక్యా పార్వతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. గ్రామంలో ఓ హోటల్ పెట్టుకుని జీవిస్తున్నాడు. వ్యాపారం కలిసిరాక హోటల్ మూతవేసి విజయవాడలో ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల జగదీష్ భార్య పార్వతి చీమలపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాలీల్ (24)తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య ఘర్షణ జరుగుతున్నది. దీంతో తమకు అడ్డువస్తున్నాడని జగదీష్‌ను హత్య చేయాలని పథకం పన్నిన ప్రియుడు ఖాలీల్ ఆదివారం రాత్రి మద్యం తాగడానికి జగదీష్‌ను పిలిచాడు. ఇద్దరూ అడ్డరోడ్డు సమీపంలోని అడవిలోకి వెళ్లారు. అక్కడ జగదీష్‌కు మద్యం తాగించి అనంతరం బండరాయితో అతడి తలపై కొట్టి హత్య చేశాడు. తర్వాత పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. ఖాలీల్ గతంలో గంజాయి సరఫరా చేస్తు పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ అబ్దుల్ నబీ తెలిపారు.

మళ్లీ జగన్ వస్తే ప్రైవేట్ ఆస్తులూ తాకట్టు, స్వాహా : నెట్టెం



జగ్గయ్యపేట, మార్చి 3 : విశాఖలో ప్రభుత్వ భూములు, సచివాలయాలే కాదు.. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రైవేట్ భూములు తాకట్టు పెట్టటమే కాదు, కబ్జాలతో స్వాహ చేస్తారని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఆరోపించారు. సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విలువైన భూములు, భవనాలు, కళాశాలలు, బస్టాండ్‌లు తాకట్టు పెట్టి వేలకోట్లు అప్పుతెచ్చి గొప్పలు చెబుతున్నాడని, 58 నెలల్లో 12లక్షల కోట్లు అప్పు తెచ్చారని, సంక్షేమ పథకాల కోసం వెచ్చించింది రూ.2 లక్షల కోట్లు అని మిగిలిన డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాల రంగులు మార్చేందుకు, కోర్టు కేసులకు వేలకోట్లు వెచ్చించారని ఆరోపించారు. జగన్‌రెడ్డిని ఇప్పటికైనా ఓడించక పోతే ప్రైవేట్ భూములకు రక్షణ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు.

నిరుద్యోగులను వంచించేందుకే మినీ డీఎస్సీ : తాతయ్య

జగ్గయ్యపేట : నిరుద్యోగులను వంచించిన జగన్‌కు బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో మైక్రోసాఫ్ట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో ట్యాలీ కోర్సులో శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ, యేటా జాబ్ కేలెండర్ వేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఉన్న కంపెనీలు, పరిశ్రమలను ఇతర రాష్ట్రాలకు పోయేలా పొగబెట్టారని, నిరుద్యోగం పెంచారని ఆరోపించారు. మినీ డీఎస్సీ అంతా జగన్మాయ అన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో గాడి తప్పిన విద్యావ్యవస్థ

» నాగశ్రావణ్‌కు షరీఫ్ సంఘీభావం

విద్యాధరపురం, మార్చి 4 : రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎండీ షరీఫ్ అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరవధిక దీక్ష చేస్తున్న కిలారు నాగ శ్రావణ్‌కు ఆయన సంఘీభావం తెలిపారు. దీక్ష సోమవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు పెండింగ్ ఫీజులందక ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులను, యువతను జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. చిన్న వయస్సు అయినా నాగశ్రావణ్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరవధిక దీక్ష చేయడం సాహసోపేత చర్యన్నారు. టీడీపీ విశాఖ ఇన్‌చార్జి మార్గాని భరత్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ బకాయిలు, ఫీజులు విడుదల చేయాలన్నారు. జీవో 77ను ఎత్తివేయాలన్నారు. టీడీపీ బొప్పన భవకుమార్, అనుబంధ సంఘాల నేతలు మద్దతు పలికారు.

ఐటీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడిగా చిరుమామిళ్ల

వన్‌టౌన్, మార్చి 4 : టీడీపీలో ఇంటర్నెట్ విభాగం (ఐటీడీపీ) విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చిరుమామిళ్ల కృష్ణారావును నియమించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నందిగామ నియోజకవర్గానికి చెందిన చిరుమామిళ్ల కృష్ణారావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటుగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన బుగత రవితేజను విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి..

» మోకాళ్లపై రైతు నిరసన



విస్సన్నపేట : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 40 రోజులు గడుస్తున్నా కొత్తది ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పుట్రేల శివారు వీరరాఘవపురం గ్రామానికి చెందిన రైతు గాదే పూర్ణచంద్రరావు సోమవారం విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏడీ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. స్పందనలో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, విద్యుత్ సరఫరా లేక పామాయిల్ తోట ఎండిపోయే దశకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశాడు. తోటి రైతులు, లిబరేషన్ నాయకుడు రైతుకు మద్దతు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు.

గీత వృత్తిని కించపరిస్తే సహించం : గౌడ సంఘం

ఎ.కొండూరు : గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న కల్లును కించపరుస్తూ ఎంపీ కేశినేని నాని, స్వామిదాసులు మాట్లాడటం గౌడకులస్తులను కించపరచడమేనని చీమలపాడు గౌడ సంఘం నేతలు బెజవాడ శంకర్, మరీదు జమలయ్య ఆరోపించారు. తిరువూరులో టీడీపీ నేత కొలికపూడి శ్రీనివాసరావు గీత వృత్తిలో కష్టాలు, గౌడ కులస్తుల జీవన విధానంపై మాట్లాడి, వారి వృత్తి ప్రోత్సాహానికి, కల్లులో ఔషధ గుణాలను చెప్పారని.. దానిని కూడా రాజకీయం చేస్తూ కల్లు తాగిన వారుకోతులు, కొండముచ్చులుగా వైసీపీ నేతలు పోల్చడం తగదని హితవు పలికారు. గీత వృత్తిని కించపరిస్తే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

ఆవులను తరలిస్తున్న లారీ బోల్తా

» 13 ఆవులు మృతి



గంపలగూడెం : ఆవులను తరలిస్తున్న లారీ అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టి బోల్తా పడటంతో ఆదివారం అర్ధరాత్రి 13 ఆవులు మృతి చెందాయి. 16 ఆవులతో లారీ హైదరాబాద్‌కు వెళుతుండగా తునికిపాడు-భగవానులపురం రహదారి మలుపు వద్ద అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టింది. గాయాలైన మూడు ఆవులు తునికిపాడు గ్రామస్థుల సంరక్షణలో ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీను తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

టైగర్ పవర్ క్లబ్ విద్యార్థులకు పతకాలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 4 : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సరైన శిక్షణ ఇస్తే రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించగలరని టైగర్ పవర్ క్లబ్ విద్యార్థులు నిరూపించారని కోచ్ వర్రే అంజిబాబు తెలిపారు. చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో టైగర్ పవర్‌క్లబ్ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు

వంట సామగ్రి పంపిణీ



వంట సామగ్రి పంపిణీ చేస్తున్న బోడె వెంకట్రామ్

నెప్పల్లి (కంకిపాడు), మార్చి 4 : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని టీడీపీ నాయకుడు ముందుకొచ్చి ఆదుకోవడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ అన్నారు. నెప్పల్లిలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు తెలుగు యువత జిల్లా కార్యదర్శి బొర్రా వెంకట్ ఆర్థికసాయంతో వంట సామగ్రి, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి బలమైన కార్యకర్తలు నాయకులు ఉన్నారన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో నాయకులు ముందుకొచ్చి వంట సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, అన్నే ధనయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, యలమంచిలి కిషోర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొలుసు గోవిందు, కోటేశ్వరరావు, రామకృష్ణ, రంజిత్, విక్రం, పులి శ్రీనివాసరావు, షేక్ బాజి, సలీం తదితరులు పాల్గొన్నారు.

రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృత పరుస్తున్నామని రక్ష ఫౌండేషన్ చైర్మన్ పడమట స్నిగ్ధ అన్నారు. నెప్పల్లిలో అగ్ని ప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ. 20 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అరకొర పనులతో సరి!

- వేలేరు అడ్డరోడ్డు నుంచి బొమ్ములూరు రామిలేరు వాగు వరకు చేపట్టనున్న మరమ్మతులు
- పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు
- పూడుకుపోయిన డ్రెయినేజీతో ఇప్పటికే అవస్థలు
- రూ.తొమ్మిది కోట్లతో చేపట్టిన పనులపై సర్వత్రా విమర్శ





జంక్షన్‌లో అభివృద్ధి పరుస్తున్న ప్రధాన రహదారి మార్జిన్‌లో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం, పైలేయర్ తొలగించకుండా వదిలేసిన రోడ్డు మార్జిన్

హనుమాన్‌జంక్షన్, మార్చి 4 : జంక్షన్‌కు బైపాస్ ఏర్పడిన నేపథ్యంలో నేషనల్ హైవే అధికారులు చేపట్టిన పాతరోడ్డు మరమ్మతు పనులపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వేలేరు అడ్డరోడ్డు నుంచి బొమ్ములూరు రామిలేరు వాగు వరకు జంక్షన్ మీదుగా సాగిన పాత రోడ్డును మరమ్మతు చేసి ఆర్అండ్‌బీ శాఖకు హైవే అధికారులు అప్పగించనున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల చేపట్టిన పనులపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేసి సెంటర్ డివైడర్‌పై లైటింగ్ కూడా ఏర్పాటు చేయనున్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.9కోట్లు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా రహదారి అభివృద్ధి పనులు ఇటీవల చేపట్టారు. పాత రహదారి మీద పై లేయర్ కట్ చేసి దానిమీద కొత్త బీటీ లేయర్ వేయనున్నారు. పై లేయర్ తొలగించే పనిలోనే నాణ్యత లోపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు లైన్లుగా ఉన్న రహదారి పైలేయర్ కట్ చేసే సందర్భంలో రోడ్డు మార్జిన్‌లో పైలేయర్ కటింగ్ చేయకుండా వదిలేసారు. మార్జిన్‌లో పేరుకుపోయిన మట్టిని కూడా కనీసం తీయకుండా అలాగే వదిలేశారు. ఆ మట్టి మీద కొత్తలేయర్ వేస్తే కొద్దిరోజుల్లోనే రోడ్డు పాడైపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. రోడ్డు వెంబడి ఉన్న డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్ వద్ద మట్టి, చెత్తా చెదారం పేరుకుపోయి నీరు నిలిచిపోతోంది. కొత్తలేయర్ నిర్మాణం కూడా పాత రహదారి లెవల్‌లోనే అభివృద్ధి చేస్తున్నట్లు కనిపిస్తోంది. దీంతో రానున్న వర్షాకాలంలో రోడ్డు మీదే నీరు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే డ్రెయినేజీ నిర్వహణ సక్రమంగా లేక కొద్దిపాటి వర్షం కురిసినా నీరు రోడ్డు మీదే నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. డ్రెయినేజీలో నీరు నడవక రోడ్డుమీదే నిలిచిన పరిస్థితి చాలాసార్లు ఎదురైంది. రహదారి అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నపుడైనా గ్రామ పంచాయతీ పాలక వర్గం పట్టించుకొని రానున్న కాలంలో సమస్య ఎదురు కాకుండా చూసుకోవాల్సి ఉంది. నాణ్యత ప్రమాణాలతో రహదారిని అభివృద్ధి చేసి ఆర్అండ్‌బీకి అప్పగించాల్సిన నేపథ్యంలో ఆ శాఖ అధికారుల పర్యవేక్షణ కూడా కరువైంది. మరమ్మతు పనులను నేషనల్ హైవే అధికారులు మమ అనిపించే తీరుగా కనిపిస్తున్నాయని స్థానికులు దుయ్యబడుతున్నారు. వర్షాకాలంలో ఎదురవుతున్న సమస్యను దృష్టిలో పెట్టుకొని గ్రామ పంచాయతీ పాలకవర్గం, నిర్వహిస్తున్న పనులపై దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యం, ఆర్అండ్‌బీ అధికారుల అలసత్వం ప్రదర్శిస్తే కోట్లాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అయ్యే పరిస్థితి వస్తుందని అధికారులు గమనించి రహదారి అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ రూరల్, మార్చి 4 : గన్నవరం నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, నియోజకర్గ అభివృద్ధికి తనను గెలిపించాలని టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు కోరారు. విజయవాడ రూరల్ మండలం నున్నలో టీడీపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడంతో పాటు పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్ తరాల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు గొడ్డళ్ల చిన్నరామారావు, దండు సుబ్రహ్మణ్యంరాజు, కలకోటి శ్రీనివాసరెడ్డి, మాదు శివరామ్‌ప్రసాద్, బాబూరావు, గంపా శ్రీనివాస్‌యాదవ్, బేతపూడి మురళీ, బోకినాల తిరుపతిరావు, గుంటక సుబ్బారెడ్డి, మాదు మహేష్, కోటిరెడ్డి, భుక్యా శ్రీను, నూతలపాటి బాబూరావు, బేతపూడి ముత్తయ్య, వల్లూరి శివ, పామర్తి శ్రీను, ఆరేపల్లి మహేష్, కందుల లీలాకృష్ణ, పెయ్యల రాజా, సుదీప్‌రెడ్డి, పోలారెడ్డి సాంబిరెడ్డి, పెయ్యల నాగరాజు, కళ్యాణ్, అంగజాల శివయ్య, ఆరేపల్లి లలిత, కోట దేవిరాణి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు అపహరణ కేసులో నిందితుడికి జైలు

గన్నవరం, మార్చి 4: పార్కింగ్ చేసిన బస్సును అపహరించిన నిందితుడికి గన్నవరం కోర్టు రెండు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్లపాలెంకు చెందిన జాస్తి రాఘవేంద్రరావు వడ్డేశ్వరంలోని కెఎల్ యూనివర్సిటీలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగానే బస్సును 2023 డిసెంబరు 23వ తేదీ రాత్రి ప్రైవేటు స్థలంలో పార్క్ చేశాడు. క్రిస్మస్ సెలవులు రావటంతో 26న బస్సు వద్దకు వెళ్లాడు. అక్కడ బస్సు లేకపోవటంతో సూపర్‌వైజర్ నారాయణకు సమాచారం ఇచ్చాడు. ఆయన ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ ఇన్‌చార్జి అనుమోలు వెంకట శివరామ్ ప్రసాద్‌కు విషయం తెలియజేయగా ఆయన గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్సు అపహరించింది విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామానికి చెందిన చింతల రవికుమార్‌గా పోలీసులు గుర్తించి అరెస్టు చేసి గన్నవరం 12వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడిపై నేరం రుజువు కావటంతో రెండు నెలలు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు.

జంక్షన్‌లో పోలీసుల కవాతు



జంక్షన్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 4 : రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సీఐ ఏఎస్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసుల బలగాలు కవాతు నిర్వహించాయి. జంక్షన్ పీఎస్ నుంచి ప్రారంభించి స్టేట్ బ్యాంక్ వీధి, సమస్యాత్మక ఇందిరానగర్ మీదుగా గుడివాడ, నూజివీడు రోడ్డుల్లో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని జంక్షన్, వీరవల్లి, ఆత్కూర్ ఎస్సైలు జనార్దన్, అర్జమ్మ, చిరంజీవి, పైడిబాబు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయాలి

- టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్



సభ సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీసీ నేతలు

పెనమలూరు, మార్చి 4 : నేటి సాయంత్రం గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా జరిగే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ పిలుపునిచ్చారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను లక్ష్యంగా చేసుకొని సైకో జగన్‌రెడ్డి సాగించిన అరాచక పాలనను ఎండగట్టే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జయహో బీసీ సభకు లక్షలాది మంది బీసీలు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సభలో బీసీలకు గత టీడీపీ ప్రభుత్వాలు చేసిన మేళ్లు, ప్రస్తుత వైసీపీ నేతలు చేసిన అరాచకాలు వివరిస్తూ వచ్చే టీడీపీ ప్రభుత్వంలో బీసీలను ఉద్ధరించే పలు ప్రభుత్వ పథకాలను వివరించనున్నట్లు వెంకట్రామ్ తెలిపారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, వీరంకి కుటుంబరావు, పీతా గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌నగర్ కాలనీలో..

పెనమలూరు అంబేడ్కర్ నగర్ కాలనీలో జరిగిన బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో దేవినేని గౌతమ్ స్మిత దంపతులు పాల్గొని టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అరాచక పాలనను ఎండగట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి రాష్ట్ర ప్రజలు సపోర్టు చేయాలని కోరారు. వెంకన్న, అంజనేయులు, భద్రయ్య, అనిల్ పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు సముచిత స్థానం

గోసాల (కంకిపాడు) : తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచితస్థానం లభిస్తుందని, పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సెంగపు రంగారావు అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారావు మాట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావంతోనే రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు వచ్చిందన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన నాటి నుంచి నేడు చంద్రబాబు నాయుడు వరకు తెలుగుదేశం బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ వస్తోందన్నారు. మంగళవారం మంగళగిరిలోని నాగార్జున యూనివర్సిటి ఎదురుగా ఉన్న స్థలంలో నిర్వహించే జయహో బీసీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ కార్యాలయం నుంచి సాయంత్రం వాహనాలు బయలుతేరతాయని కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

హనుమాన్‌జంక్షన్ : టీడీపీతోనే బీసీ వర్గాల అభ్యున్నతి సాధ్యమని, జయహో బీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళగిరిలో మంగళవారం జరగనున్న జయహో బీసీ సభకు బాపులపాడు మండలం నుంచి 100 వాహనాల్లో కార్యకర్తలు, అభిమానులు తరలివెళుతున్నట్లు రాజేశ్వరరావు తెలిపారు. ప్రజానీకం తరలివెళ్లడానికి అన్ని గ్రామాల్లో వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెనమలూరు సీటు తనకే ఇవ్వాలి

- టీడీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి

పెనమలూరు, మార్చి 4 : పెనమలూరు టీడీపీ సీటు మైనారిటీలకు ఇచ్చే పక్షంలో తన పేరును ప్రధానంగా పరిశీలనలోకి తీసుకోవాలని టీడీపీ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి డిమాండ్ చేశారు. సోమవారం కానూరు వెలగపూడి శంకరబాబుకు చెందిన టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా టీడీపీ అధికారంలో లేకపోయినా బోడె ప్రసాద్, వెలగపూడి శంకరబాబులాంటి వారు టీడీపీని తమ శక్తి సామర్థ్యాలతో నడిపించారని, బోడె ప్రసాద్‌కు ఇంతవరకు టికెట్టు ప్రకటించలేదని, ఒకవేళ పెనమలూరు టికెట్టును మైనారిటీలకు ఇచ్చే పక్షంలో మైనారిటీ కోటా కింద తనకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంత్రి జోగి రమేష్‌పై పాతిక వేల ఓట్ల మెజారిటీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వందలాది ముస్లిం కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్, మార్చి 4 : స్థానిక నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి తెనాలికి చెందిన నరిశెట్టి సాయిరామ్ (27) దుర్మరణం చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం విజయవాడ వైపు నుంచి వైజాగ్ వెళుతున్న గుర్తుతెలియని రైలు నుంచి మృతుడు జారిపడి దుర్మరణ చెందినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. తెనాలి, ముస్లిం వీధి, గంగానమ్మపేటకు చెందిన సాయిరామ్ చొక్కా జేబులో రాజమండ్రి వెళుతున్న టిక్కెట్లు లభ్యమైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏలూరు జీఆర్‌పీ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురిలో భద్రపరిచినట్లు తెలిపారు.

నూరుశాతం పల్స్ పోలియో

గన్నవరం, మార్చి 4 : నూరుశాతం పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం చేశామని హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం చిక్కవరంతో పాటు పలు గ్రామాల్లో ఇంటింటికి, పరిశ్రమల వద్దకు వెళ్లి మిగిలిన 19మంది చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరి సహకారం పోలియో చుక్కలు వేయటం జరిగిందన్నారు. సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డి.హారిక, కె.కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

రంగన్నగూడెం అభివృద్ధికి మాచమ్మ కృషి

- సంతాపసభలో రైతు సంఘాల నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 4 : సహకార సంఘాల ద్వారా మాత్రమే పాడిరైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమని నమ్మి రంగన్నగూడెంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని స్థాపించడంతో పాటు సర్పంచ్‌గా 1960లోనే గ్రామాభివృద్ధికి నిబద్ధతతో కృషి చేసిన నాయకురాలు ఆలపాటి మాచమ్మ అని రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి నాయకుడు వై.కేశవరావు కొనియాడారు. రంగన్నగూడెంలో ఇటీవల మరణించిన కమ్యూనిస్ట్ నాయకురాలు, మాజీ సర్పంచ్ ఆలపాటి మాచమ్మ సంతాపసభను సోమవారం ఆళ్ల గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, పునులూరి లక్ష్మీనారాయణ, బేతా శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, పాతూరి రవి, గంటా పాపారావు, యార్లగడ్డ సతీష్, దయాల రాజేశ్వరరావు, అవిర్నేని శేషగిరిరావు, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న సీతారామదాస్

పారిశ్రామికాభివృద్ధికి ఆద్యుడు వెలగపూడి

ఉయ్యూరు, మార్చి 4 : రాష్ట్రంలో కేసీపీ, ఇతర పరిశ్రమలు నెలకొల్పి పారిశ్రామికాభివృద్ధికి వెలగపూడి రామకృష్ణ బాటలు వేశారని కేసీపీ షుగర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఉయ్యూరు యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ కొనియాడారు. వెలగపూడి రామకృష్ణ 128వ జయంతి పుర స్కరించుకుని సోమవారం కర్మాగార ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా 53వ జాతీయ భద్రతా దినోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భద్రత దినోత్సవ జెండా ఎగురవేసి భద్రత పరికరాల ప్రదర్శన ప్రారంభించారు. భద్రతపై కార్మికులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అంద జేశారు. 15మంది కార్మికులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 4లక్షల ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. ఫైనాన్స్ హెడ్ వసంతరావు, వ్యవసాయ విభాగ హెడ్ పున్నారావు, డిస్టలరీ డీజీఎం కె చంద్రబాబు, సంపత్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఆర్ నరేంద్ర, సయ్యద్ అనీస్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

ఉయ్యూరు, మార్చి 4 : నిబద్ధతతో విధులు నిర్వర్తించి వినియోగదారులు, అధికారుల మన్ననలు పొందాలని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు సబ్ డివిజన్ ఏఈ కృష్ణనాయక్ సూచించారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విధినిర్వహణలో అలసత్వం, అజాగ్రత్త ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. ఈ కార్యక్ర మంలో డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలు, లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ లైన్‌మెన్‌లు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. సబ్ డివిజన్ అధికారులు పి శివనాగేశ్వరరావు, ఎస్ సుబ్రమణ్యేశ్వరరావు, ఎంవీవీ రామకృష్ణ, డివిజన్ సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణనాయక్

టీడీపీ విజయాన్ని ఆపలేరు



బాపులపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

హనుమాన్‌జంక్షన్, మార్చి 4 : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఏ శక్తి అపలేదని రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మూల్పూరి సాయి కల్యాణి అన్నారు. బాపులపాడు పట్టణ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం బాపులపాడు కృష్ణనగర్‌లో ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. గన్నవరం టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పట్టణ కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, నాయకులు కాకుల శ్రీను, గుమ్మడి శేషగిరిరావు, సంగ్రామ్, కడవకొల్లు రాజేష్, నాగరాజు, కోమర్తిసాయి, కర్రా ప్రసాద్, పౌల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ రూరల్, మార్చి 4 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7,8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పులిగడ్డ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఆర్. నరసింహారావు తెలియజేశారని చెప్పారు. గురుకులాల్లో చేరే విద్యార్థులు ఈనెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష ఏప్రియల్ 25వ తేదీన జరుగు తుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్‌కు 8712625033కి సంప్రదించాల్సిందిగా తెలిపారు.



లైన్‌మెన్‌లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు

విద్యుత్ లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేం

లైన్‌మెన్ల దినోత్సవంలో కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్‌మెన్‌ల సేవలు వెలకట్టలేమని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని మచిలీపట్నం డివిజన్ విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఎన్ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో లైన్‌మెన్‌లు అందించే సేవలు అమోఘమన్నారు. విద్యుత్‌శాఖ ఈఈ భాస్కరరావు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌లు పునాదివంటివారన్నారు. జాతీయ లైన్ మెన్‌ల దినోత్సవం రోజున వారిని సముచితంగా గౌరవించడం మంచి సంప్రదాయమన్నారు. విద్యుత్‌శాఖలో ఉత్తమ సేవలందించిన లైన్‌మెన్‌లను కలెక్టర్, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు. వైసీపీ మ చిలీపట్నం ఇన్‌చార్జి పేర్ని కిట్టు, మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు విజయలక్ష్మి, శీలం భారతి, విద్యుత్‌శాఖ ఏడీలు, ఎఈలు పాల్గొన్నారు.

చల్లపల్లి విద్యుత్‌శాఖ అధికారులకు అవార్డులు



చల్లపల్లి : జాతీయ లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా చల్లపల్లి విద్యుత్‌శాఖ అధికారులకు అవార్డులు లభించాయి. ఉయ్యూరులో జరిగిన కార్యక్రమంలో చల్లపల్లి మండల విద్యుత్ ఏఈఈ కె.అరవింద్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ పి.ఎలీషా ప్రసాద్, వక్కలగడ్డ లైన్‌మెన్ మహబూబ్ సుభానీ అవార్డులు అందుకున్నారు. వారిని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్, చల్లపల్లి సబ్‌డివిజన్ డీఈఈ పులి శివనాగేశ్వరరావు, అధికారులు, సిబ్బంది అభినందించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రమిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది సేవలు అమూల్యమైనవని కృష్ణనాయక్ అభినందనలు తెలిపారు.

పట్టాభి భవన నిర్మాణానికి కార్పొరేషన్ అనుమతులివ్వాలి



మచిలీపట్నం టౌన్, మార్చి4 : భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి మచిలీపట్నం కార్పొరేషన్ పాలక వర్గం అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం న్యాయవాదులు, భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈడేపల్లిలో భవనానికి కేటాయించిన స్థలం వద్ద న్యాయవాదులు దివి పోతురాజు, మాదివాడ వెంకట నరసింహమూర్తితో పాటు న్యాయవాదులు గుమాస్తాల సంఘం నాయకుల పి.వి.ఫణికుమార్, బీజేపీ నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, చలమలశెట్టి రమేష్, పిఎస్ఎస్ఆర్ శర్మ, మహదేవమూర్తి తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.



వెనిగండ్ల రాము సమక్షంలో టీడీపీలో చేరుతున్న చక్రధర్



కుమార్‌రాజా సమక్షంలో టీడీపీలో చేరుతున్న నారాయణపురం ప్రజలు



గూడూరులో శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

వైసీపీని సాగనంపండి

నందివాడ (పొనుకుమాడు), మార్చి 4 : తాగునీటి సమస్యను వైసీపీ పాలకులు పట్టించుకోలేదని గండేపూడి, పొనుకుమాడు గ్రామ ప్రజలు గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ఎదుట వాపోయారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి దండిగానపూడి, పొనుకుమాడు గ్రామాల్లో నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు సమస్యలను వెనిగండ్ల రాముకు వివరించారు. వైసీపీ నాయకుడు పెంటి చక్రధర్, పెంటి గోపికృష్ణ, పోలుకొండ యలమంద మరో 15 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరినట్లు గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి దుర్గా ప్రసాద్ తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి (బాబ్జీ), చాట్రగడ్డ రవి, పొనుకుమాడు టీడీపీ గ్రామ అధ్యక్షుడు మరడాల శ్రీనివాసరావు, తంగుడు శివాజీ, బొడ్డుపాటి వెంకట శ్రీనివాసరావు, బండి రమేష్, ఘంటసాల వీరయ్య, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : సీఎం జగన్ గ్రామ పంచాయతీలను భ్రష్టుపట్టించారని పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కుమార్ రాజా విమర్శించారు. తోట్లవల్లూరులో 29వ రోజు సోమవారం పల్లెబాట నిర్వహించి పారిశుధ్య కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు అండగా నిలవాలని కోరారు. వీరంకి వెంకట గురుమూర్తి, గొరిపర్తి గోప య్య, వల్లూరు రాంబాబు, తోట సాయిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

వేల్పూరు (పమిడిముక్కల) : పమిడిముక్కల మండల వేల్పూరు, కృష్ణాపురం పంచాయతీ పరిధి నారాయణపురంలో టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా సోమవారం పల్లె బాట నిర్వహించారు. వేల్పూరులో వైసీపీకి చెందిన కొందరు టీడీపీలో చేరారు కుమార్ రాజా వారికి పార్టీకండువా కప్పి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరి బాబ్జి, జక్కా శ్రీనివాసరావు, వేల్పూరు సర్పంచ్ రత్నం దిలీప్, లింగమనేని బాబూరావు, మోటూరి వెంకటసుబ్బయ్య, బోలెం నారాయణ పాల్గొన్నారు.

నేడు బీసీ డిక్లరేషన్ : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : మంగళగిరి నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా మంగళవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బీసీ సాధికార సభలో చంద్రబాబు బీసీల డిక్లరేషన్ ప్రకటిస్తారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొల్లు రవీంద్ర మాట్లాడారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జన సేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. బీసీలను సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా బీసీ డిక్లరేషన్ అందిస్తామన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీలు దారుణంగా మోసపోయారన్నారు. కోలుకోని స్థితిలో ఉన్న బీసీలకు బీసీ డిక్లరేషన్ ద్వారా మళ్లీ పూర్వవైభవం వస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల వరకు రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్ సమావేశాలు నిర్వహించి బీసీ సంక్షేమానికి తెలుగుదేశం తీసుకున్న నిర్ణయాలను తెలియచేయాలన్నారు.



జయహో బీసీ సభను విజయవంతం చేయండి

మచిలీపట్నం టౌన్ : నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా మంగళవారం మధ్యాహ్నం జరగనున్న జయహో బీసీ సభను విజయవంతం చేయాలని టీడీపీ బీసీ నాయకులు పిలుపునిచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో జయహో బీసీ సెల్ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. లంకే నారాయణ ప్రసాద్, గోకుల శివ తదితరులు మాట్లాడారు.

టీడీపీ కార్యకర్త ఒక్కరూ పార్టీని వీడలేదు

గుడివాడ : టీడీపీ కార్యకర్త ఒక్కరు కూడా వైసీపీలో చేరలేదని, దమ్ముంటే నిరూపించాలని టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు సవాల్ విసిరారు. బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ కౌన్సిలర్ షేక్ ఇబ్రహీం, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ జానీ షరీఫ్, సయ్యద్ జబీన్, మహ్మమద్ రఫీ తదితరులు విలేకరులతో మాట్లాడారు. కోవర్టు పనులు చేస్తున్న వ్యక్తిని వెనిగండ్ల రాము మెడ పట్టుకుని గెంటి వేయ డం జరిగిందన్నారు. స్వశక్తితో ఎదిగి, కులమతాలు చూడకుండా పేదలందరికీ మంచి చేస్తున్న వెనిగండ్ల రాము గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహిం చేది లేదన్నారు.

అభివృద్ధి శిలాఫలకంతో సరి!

పెడన రూరల్ : గూడూరును రూ.9.66 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తామని శిలాఫలకం వేసి ఏళ్ల గడుస్తున్నా పనులు ప్రారంభించలేదని మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి విమర్శించారు. శిలాఫలకం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వెంటనే పనులు మొదలు పెట్టకపోతే రానున్న ఎన్నికలలో ప్రజలను ఓటు అడిగే హక్కు కోల్పోతారన్నారు. ఎన్ఎ బేగ్, గోరిపర్తి ఫణిరాజు, డొక్కు నాగరాజు, యర్ర ప్రసాద్, బేతాల స్వామి, పోతన రంగ, రోషన్, లుక్కా మహేష్, మెరు గుమాల రాము, కిరణ్, పవన్, అనిల్, రాంబాబు పాల్గొన్నారు.



స్పందనకు వచ్చి తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

భూములకు పరిహారం ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 4 : తమ భూములు జగనన్న కాలనీకి తీసుకుంటున్నారని, తగిన పరిహారం ఇవ్వాలని బాధితులు కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, విశ్వనాథపల్లి మాధవరావు, బి. బాబురావు, రమేష్ తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనలో తమ గోడు వినిపించుకున్నారు.

పింఛన్ పునరుద్ధరించండి



తన పింఛన్ అర్ధాంతరంగా ఆపేశారని వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన దివ్యాం గుడు మాతాను నాగేశ్వరరావు(78) ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్పందనకు వచ్చి పించను పునరుద్ధరించాలంటూ తమ గోడు వినిపించుకున్నాడు.

సీఎం సాయం అందించండి



మచిలీపట్నం టౌన్ : కదల లేని స్థితిలో ఉన్న తన కుమారుడికి ఆపరేషన్ ఖర్చులు ప్రభుత్వం అందజేయాలని దివ్యాంగుని తల్లి సుశీల కోరారు. మచిలీపట్నం ఆదర్శనగర్‌కు చెందిన దివ్యాంగుడు ప్రవీణ్‌కుమార్‌ను స్పందన కార్యక్రమానికి తీసుకుని వచ్చి అర్జీ ఇచ్చారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆపరేషన్ ఖర్చులు ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు.

ఖాదీ గాంధీ కన్నుమూత



మోపిదేవి : కోసూరువారిపాలెంలో ఖాదీ గాంధీగా పిలువబడే కోసూరు గోపాల కృష్ణమూర్తి (98) సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. దివిసీమ సర్వోదయ సహాయక సమితి ఖాదీ సంస్థకు 25 సంవత్సరాల పాటు కార్యదర్శిగా పని చేసిన గోపాలకృష్ణమూర్తి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గోపాలకృష్ణమూర్తి మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

మోపిదేవి : కప్తానుపాలెం షిర్డిసాయిబాబా ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులకొట్టి ఆలయంలో ఉన్న వెండి కిరీటాలు, ఇతర ఆభరణాలు అపహరించుకుని వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. సోమవారం ఉదయం అర్చకులు ఆలయానికి రాగా, తాళాలు పగులకొట్టి గేట్లు తెరిచి ఉండటం గమనించి చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి మొవ్వలో పల్లెబాట

కూచిపూడి : టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్ రాజా మంగళవారం నుంచి మొవ్వ మండలంలో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర తెలిపారు. ఉదయం 9 గంటలకు ఉండ్రపూడి ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి అనంతరం అయ్యంకి, పెదసనగల్లు, భట్లపెనుమర్రు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వీరేంద్ర కోరారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం

చల్లపల్లి : చల్లపల్లి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియోపతి వైద్యశిబిరం నిర్వహించారు. శ్రావణి హోమియోకేర్ వైద్యులు డాక్టర్ పి.సాయి మణికంఠ రోగులకు వైద్యసేవలందించగా, ఉచితంగా మం దులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, అన్నం సత్యవాణి, మలిశెట్టి చెంచు రాములు, దింటకుర్తి జ్యోతి, నంబూరి కుసుమ కుమారి సహకారం అందించారు.

అధ్వానంగా పాగోలు రహదారి



చల్లపల్లి : పాగోలు ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఎన్టీఆర్ మోడల్ స్కూల్ వద్ద ఇసుక టిప్పర్ సోమవారం రోడ్డుపై దిగబడింది. దీంతో జేసీబీ సహాయం తో టిప్పర్‌ను తీయాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో అధ్వాన్న స్థితికి చేరిన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరు తున్నారు.

గ్యాస్ లీకై పాక, గడ్డివామి దగ్ధం

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో సోమవారం గ్యాస్‌లీక్ అయి మేకల శివరామ్, డి.శ్రీనివాసరావులకు చెందిన నాటుకోళ్ల పాక, వరిగడ్డి వామి దగ్ధమయ్యాయి. ఉయ్యూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రూ 1.50 లక్షల నష్టంవాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి రవితేజ తెలిపారు.

గుడివాడలో కేంద్ర బలగాల కవాతు




గుడివాడ : గుడివాడ, పామర్రు నియోజకవర్గాలోని సమస్యాత్మక గ్రామాలు, వార్డుల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పిస్తారని డీఎస్పీ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో పోలీసు అధికారులతో కలిసి కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులను కేంద్ర బలగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గుడివాడ సబ్ డివిజన్‌కు సీఐఎస్ఎఫ్‌కు చెందిన 92 మందిని కేటాయించారని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ కవాతులో పట్టణ సీఐలు కె.శ్రీనివాసరావు, దుర్గారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మచిలీపట్నం టౌన్ : జిల్లాలో ఈనెల 18 నుంచి జరిగే టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో చంద్రశేఖరరావు అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో సోమవారం ఆయన విద్య, పోలీసు, వైద్య, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 18 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. మచిలీపట్నం, గుడివాడ డివిజన్లలో ఐదు పరీక్షా కేంద్రాల్లో 973 మంది పదవ తరగతి, 1803 మంది ఇంటర్ అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. డీఈవో తాహెరా సుల్తానా, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎం. డేవిడ్‌రాజు, సీఐ సోమేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ సునీల్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జనసేన నేత మాదివాడ చొరవ



మోపిదేవి : పెదకళ్లేపల్లి శివారు అడపావారిపాలెం రహదారి వెంబడి ఉన్న ముళ్ల పొదలు, శ్మశాన వాటిక రహదారి పనులను సోమవారం జనసేన పార్టీ నాయకులు మాదివాడ వెంకట కృష్ణ ప్రారంభించారు. అడపా వారిపాలెం నుంచి రజాపురం శ్మశానవాటికకు వెళ్లే రహదారి ముళ్ల చెట్లతో నిండి ఉండగా, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు మాదివాడ వెంకటకృష్ణ ఆర్థిక సాయంతో పనులు చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ వైద్యులకు సత్కారం



మోపిదేవి : ఉద్యోగులు తన విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు అన్నారు. పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హారిక, శ్రీరామ్ సాయిలను గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీవిద్య, ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు, సీఐ నాగప్రసాద్, డీఎల్‌పీవో జ్యోతిర్మయి సత్కరించారు. వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా వెంకటేశ్వరరావు, కిరణ్ కాంత్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగలూరు డైట్‌కు బీరువా వితరణ



గుడ్లవల్లేరు : అంగలూరు డైట్ కళాశాల 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.25 వేల విలువగల బీరువాను కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ నారాయణకు అందజేశారు. ఎ.సుబ్రహ్మణ్యం, టి.శ్రీనివాసరావు, వి.బాలాజీ,వెంకటేశ్వరరావు, జి.విజయ్ కుమార్, కె.రామకృష్ణ, ఎ.వరలక్ష్మి, కె.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నరసప్ప చెరువులో ఉద్రిక్తత

పెడన : చేపల చెరువు తవ్వకం విషయమై నరసప్పచెరువు గ్రామంలో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. రాజనాల నాగబాబు తన పొలంలో చేపల చెరువు తవ్వేందుకు గత కొంత కాలంగా ప్రయత్ని˝స్తుండగా చెరువు తవ్వితే తమ పొలాలు పాడవుతాయంటూ పక్క పొలాల రైతులు అడ్డుకుంటూ వస్తున్నారు. చేపల చెరువు తవ్వకానికి హైకోర్టు నాగబాబుకు అనుమతి ఇచ్చింది. చెరువు తవ్వకానికి రక్షణ కల్పించాలని నాగబాబు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో నరసప్పచెరువు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. నాగబాబుతోను, చెరువు తవ్వకాన్ని అడ్డుకుంటున్న రైతులతో మాట్లాడిన ఎస్సై ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా ఒక పరిష్కార మార్గాన్ని చూపించారు. నాగబాబు, పక్క రైతులు అంగీకరించడంతో కథ సుఖాంతమైంది. నాగబాబు చెరువు తవ్వకం పనులు ప్రారంభించాడు.

ర్యాంప్ పథకం చిరు వ్యాపారులకు వరం

గుడివాడ : ప్రపంచ బ్యాంకు సహకారంతో ప్రవేశపెట్టిన ర్యాంప్ పథకాన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఆడిటర్ ఎం.ఆర్ ప్రసాద్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్య, తరహా పరిశ్రమలు పనితీరును మెరుగుపరచి అభివృద్ధిని వేగవంతం చేయడమే పథకం లక్ష్యమన్నారు. ర్యాంప్ సర్వే జరుగుతున్నందున గ్రామ, వార్డు కార్యదర్శుల వద్ద వ్యాపారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వ ప్రోత్సాహకాలను, సులభంగా బ్యాంకు రుణాలను పొందుతారన్నారు.

గుడ్లవల్లేరులో సిమెంటు బల్లల పంపిణీ



గుడ్లవల్లేరు : నెప్రహా పశువుల సంత అండ్ గ్రామాభివృద్ధి సంఘం వజ్రోత్సవాల్లో భాగంగా గుడ్లవల్లేరులో పలు ప్రాంతాలకు సిమెంటు బల్లలు అందజేస్తున్నట్లు సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి తెలిపారు. సోమవారం సంత ఆవరణలో సిమెంటు బల్లలను ఆయన అందజేశారు. సంత కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, ఈడ్పుగంటి ఉమా మహేశ్వరరావు, సభ్యులు కుంచపర్తి ప్రభాకరరావు, కోటేశ్వరరావు, వల్లభనేని వరప్రసాద్, అడుసుమిల్లి భూపతి, కుసం కోటేశ్వరరావు, యలమంచిలి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువ న్యాయవాదుల మృతి బార్ సంతాపం


మచిలీపట్నం టౌన్ : యువ న్యాయవాదుల మృతి న్యాయ వ్యవస్థకు తీరని లోటని జిల్లా జడ్జి అరుణ సారిక అన్నారు. ఇటీవల మృతి చెందిన మట్టా లోకనాథం, పల్లంపాటి హర్షవర్ధన్‌ల సంతాప సభ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలుసు హరిబాబు అధ్యక్షత వహించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, 10వ అదనపు జిల్లా జడ్జి నరసింహమూర్తి, ఆరో అదనపు జిల్లా జడ్జి చినబాబు, ప్రభుత్వ న్యాయవాది శీతాల ప్రసాద్, ఏపీపీ వడ్డి జితేంద్ర, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, సీనియర్ న్యాయవాదులు సిర్విశెట్టి నగధర్, మాదివాడ వెంకట నరసింహారావు, సమ్మెట శివ తదితరులు మాట్లాడారు.

మహిళా మోర్చా ఆధ్వర్యంలో 2కే రన్



మచిలీపట్నం టౌన్ : మహిళల స్వావలంబన, సాధికారిత కోసం కృషి చేయాలంటూ సోమవారం మచిలీపట్నంలో జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శనక్కాయల లీలాకుమారి, వి. రమాదేవి, దోవారి ధనలక్ష్మి, టి. పద్మావతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళి, పుప్పాల రామాంజనేయులు, చాట్రగడ్డ రాజశేఖర్, నాగలింగం అయోధ్యరామచంద్రరావు, పత్తిపాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు అప్టా ఆర్థిక ప్రోత్సాహం



మచిలీపట్నం టౌన్ : ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదువుతూ 9.9 గ్రేడ్ పాయింట్లు సాధించిన చిట్టూరి దివ్యకు అమెరికన్ ప్రొఫెషనల్ తెలుగు అసోసియేషన్ (అప్టా) సోమవారం రూ. 18 వేల స్కాలర్షిప్ అందజేసింది. సువర్ణకల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో చిట్టూరి దివ్యకు మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ రూ. 18వేల చెక్కు అందజేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, డాక్టర్ అల్లాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.